క్లుప్తంగా

మేడాలమ్మకు ప్రత్యేక పూజలు



దర్శనమిస్తున్న మేడాలమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లిలోని మేడాలమ్మ ఆలయంలో అమ్మవారికి బుధవారం పూజారి శివశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడాలమ్మను పూజిస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తులు విశ్వాసం. దీంతో మహిళలు పూజల్లో పాల్గొని మేడాలమ్మకు పూజలు జరిపారు.

పశువుల మేతకు గిరాకీ



పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

చిన్నమండెం : పాడి పరిశ్రమను నమ్ముకుని అత్యధిక మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. అయితే గత ఖరీఫ్ రబీ సీజన్‌లో వరి కోతల సమయాలలో వర్షాలు అధికంగా కురవడంతో వరిగడ్డి పూర్తిగా కుళ్లిపోయింది. దీంతో ఇప్పుడు పశువులకు మేత లేక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిసెంబర్‌లో వేరుశనగ సాగు కూడా అంతంత మాత్రమే చేయడంతో గొర్రెలు, పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడింది. దీంతో బయట ప్రాంతాలకు వెళ్లి ఒక ట్రాక్టర్ వరిగడ్డి, వేరుశనగ ఆకు రూ.15 వేలపైన పెట్టినా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు.

భాకరాపేట వద్ద పూడికతీత పనులు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

సిద్దవటం : కడప– చెన్నై జాతీయ ప్రధాన రహదారిలోని భాకరాపేట సమీపంలో డ్రైనేజీ పూడికతీత పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్‌ల ఆధ్వర్యంలో పనులను చేయించారు. ఈ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వీరన్న, డీఈ విద్య, ఏఈ మానసలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ వీరన్న మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ముందు జాగ్రత చర్యగా పూడిక తీత పనులను చేపట్టమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భర్త నరసింహారెడ్డి, వీఆర్‌ఓ నాని పాల్గొన్నారు.

పేద దళితులకు భూములివ్వాలి



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : అర్హత కలిగిన పేద దళిత కుటుంబాలకు భూములివ్వాలని సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బాలిరెడ్డిపల్లె రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములలో సీపీఐ నాయకులు గ్రామస్తులతో కలిసి కంపచెట్లను తొలగించే కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సి.నాగమ్మ మాట్లాడుతూ వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయని వైకోట, బాలిరెడ్డిపల్లె గ్రామాలలో రెవెన్యూ భూములను దశాబ్దాలుగా గ్రామంలోని అర్హులైన పేదలకు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరామన్నారు. అధికారులు సంబంధిత భూములను పరిశీలించి భూ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఏరియా కార్యదర్శి జోతి చిన్నయ్య, సీపీఐ నాయకులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

18న వాహనాల వేలం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈనెల 18న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు. ఆసక్తిగల వారు వేలంపాటలో పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చన్నారు. గతంలో లైసెన్సు, ఇతర పత్రాలు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఒంటిమిట్టలో నడివీధి గంగమ్మ జాతర

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని బజారు వీధి నడిబొడ్డున ఉన్న నడివీధి గంగమ్మకు నేడు(గురువారం) జాతర వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రికి చెక్కభజన, ఆశాధుల కథ, గురువారం తెల్లవారుజామున బలులు నిర్వహిస్తారు.

మొదలైన ఇంటర్ పరీక్షల సందడి

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించకూడదని ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో అనేక మంది విద్యార్థులు ఎనిమిది గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. 8:30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిచ్చారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్‌లో తొలి పబ్లిక్ పరీక్ష కావడంతో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లల వెంట పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చారు. తమ పిల్లలు పరీక్షా కేంద్రంలోకి వెళ్ళే వరకు తల్లిదండ్రులు వారితోనే ఉండి వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. పరీక్ష అయిపోయాక తమ పిల్లలు బయటకు రాగానే ఎలా రాశావంటూ తల్లిదండ్రులు వారిని ఆతృతగా అడగడం కనిపించింది. విద్యార్థులు నిర్ణీత సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు పోలీసులు ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 371 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 20 మంది, కాకతీయ (షిర్డి సాయి) కళాశాలలో 247 మందికి ఏడుగురు, నలంద కళాశాలలో 334 మందికి 25 మంది, గీతాంజలి కళాశాలలో 217 మందికి ఆరుగురు గైర్హాజరయ్యారు.



రాజంపేట టౌన్: పరీక్షకు హాజరైన విద్యార్థులు



రాజంపేట టౌన్: విద్యార్థులకు గదుల వివరాలను తెలియజేస్తున్న సిబ్బంది

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

పెనగలూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. కళాశాల గేటు వద్దే పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి సెల్‌ఫోన్లను లోనికి తీసుకెళ్లకుండా పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. బాలికలకు అధ్యాపకురాలుచే తనిఖీలు చేయించి లోనికి పంపించారు. మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఒకేచోట సెంటర్ నిర్వహించారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తెలుగు, హిందీ పరీక్షలు బధవారం చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా నిర్వహించారు. నిర్వహణ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మొత్తం 203 మంది విద్యార్థులు పరీక్షలు రాయవల్సి ఉండగా 196 మంది విద్యార్థులు హాజరయ్యారని 07 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు.

రామాపురంలో..

రామాపురం : మండల కేంద్రం పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలో 211 మంది విద్యార్థులకుగాను 198 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపల్ చీఫ్ శ్యామలాదేవి తెలిపారు. పరీక్ష కేంద్రంలో మోడల్ స్కూల్, ఏపీ గురుకులం, కస్తూర్బా బాలికలు, లక్కిరెడ్డిపల్లె జూనియర్ కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులు ఈ పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసినట్లు తెలిపారు.

సంబేపల్లె : ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని యర్రగుంట సమీపంలో ఉన్న బాలయోగి గురుకుల కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో సంబేపల్లె, చిన్నమండెం ఆదర్శ కళాశాలల, దేవపట్ల, యర్రగుంట్ల కళాశాలలకు సంబంధించి 260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 257 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు. మిగిలిన 3 మంది విద్యార్థులు హాజరుకాలేదన్నారు. పరీక్షా కేంద్రాన్ని రూరల్ సీఐ లింగప్ప పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలు చేసినట్లు ఆయన తెలిపారు.



సంబేపల్లె: పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థినులు



పెనగలూరు: పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు వేచివున్న విద్యార్థినులు

వీధి కుక్కలను నియంత్రించాలి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ అధికారులు పట్టణంలో వీధికుక్కలను వెంటనే నియంత్రించాలని పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశంకర్ కోరారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపేట, బోస్ నగర్, బస్టాండు రోడ్డు, ఠాణా, సుండుపల్లె రోడ్డు, సాయి థియేటర్, జగదాంబ సెంటర్, ఎస్‌ఎన్ కాలనీ, రవి థియేటర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో చికెన్ దుకాణాల వద్ద కుక్కలు గుమ్మికూడి చిన్నపిల్లలను, పెద్దలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. కుక్కలు ద్విచక్రవాహనాల వెంట పరుగెడుతూ వాహన చోదకులను భయపెడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం సభ్యుడు ఎం.రవిశంకర్, వినియోగదారుల ఫోరం సభ్యుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఉరుసు

వాల్మీకిపురం : సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సందాని తెలిపారు. ఈ నెల 16వ తేదీ గురువారం గంధం, ముషాయిరా కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 17వ తేదీ శుక్రవారం ఉరుసు, ఖవాలి, 18వ తేదీ తహలీల్ ఫాతెహా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప పెద్దదర్గా పీఠాధిపతి హజ్రత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిపుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుసేని పాల్గొంటారన్నారు.

ఆరోగ్య మేళాను విజయవంతం చేయండి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

సిద్దవటం : ప్రతి నెలలో 14వ తేదీన జరిగే ఆరోగ్య మేళాను విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 14వ తేదీన అన్ని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా ఈ కార్యక్రమం జరగాలని, అందులో దీర్ఘకాలిక వ్యాధులైన బి.పి., షుగర్, వంటి వ్యాధులకు పరీక్షలు, చికిత్సా విధానం, అవి రాకుండా ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రతలు, యోగా విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈనెలలో క్షయ వ్యాధి గురించి ఎక్కువగా ప్రచారం చేయాలన్నారు. క్షయ వ్యాధిని ఎలా గుర్తించాలి, ఎవరెవరికి పరీక్షలు చేయాలి అని తెలియజేశారు. కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతి కళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య మేళాపై వైద్య సిబ్బందితో చర్చిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

రోగులకు అందుబాటులో ఉండండి

అర్బన్ పీహెచ్‌సీ తనిఖీలో మున్సిపల్ చైర్మన్

రాయచోటి అర్బన్ : వైద్యులు నిత్యం రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలను అందించాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని బండ్లపెంట అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయం లో చికిత్స కోసం కేంద్రానికి విచ్చేసిన రోగులతో మాట్లాడారు. కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉన్నారా? లేదా? వైద్యసహాయం బాగా అందుతోందా? వైద్యులు, సిబ్బంది ఏమైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అంటూ రోగుల వద్ద ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికి సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో మున్సిపల్ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేసిందన్నారు. వైద్యులు నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి చేయాలంటూ కోరారు.



రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఉపేక్షించం

గాలివీడు : మండల కేంద్రం టౌన్ పరిధిలో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ దైవాదీనం, ఎంపీడీఓ శేఖర్ నాయక్, ఎస్‌ఐ వెంకట శివకుమార్ వాహనదారులను హెచ్చరించారు. బుధవారం వారు గాలివీడు గేటు నుంచి బస్టాంట్ వరకు ప్రధాన రహదారిపై సంచరిస్తూ ట్రాఫిక్ సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించడం, దుకాణాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరుకు నాలుగు వరుసల రహదారి అయినప్పటికీ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తీవ్రంగా పరిగణించిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం శనివారంలోపు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని సూచించారు. లేని ఎడల కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్యలపై ఆరాతీస్తున్న తహసీల్దార్ దైవాదీనం, ఎంపీడీఓ శేఖర్ నాయక్

రాజకీయ శాస్త్రవేత్త కాన్షీరామ్

మదనపల్లె సిటీ : మెజారిటీ ప్రజలైన బహుజనులు రాజకీయ అధికారం చేపట్టే మార్గాన్ని కనుకొన్న రాజకీయ శాస్త్రవేత్త కాన్షీరామ్ అని భారతీయ అంబేద్కర్ (బాస్) వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక బాస్ కార్యాలయంలో కాన్షీరామ్ 89వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాధికార దిశగా బహుజన నాయకత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు బాస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8న రాజ్యాంగరక్షణ భేరి పేరుతో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేద్కర్ సర్కిల్‌లో అన్నదానం చేశారు. బీఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



కాన్షీరామ్‌కు నివాళులు అర్పిస్తున్న బాస్ నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు కలిచెర్ల విద్యార్థిని ఎంపిక

పెద్దమండ్యం : రాష్ట్రస్థాయిలో జరిగే ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు కలిచెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని మెహతాజ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి బుధవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గతనెలలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 780 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పాఠశాల విద్యార్థిని ఫార్మర్ ఫ్రెండ్లీ గైడర్ అనే ప్రయోగం చేసినట్లు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థిని పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని, గైడ్ ఉపాధ్యాయుడు శ్రీధర్‌కుమార్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

టీబీపై నిర్లక్ష్యం వీడండి



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సృజన

రాజంపేట రూరల్ : టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో నిర్లక్ష్యం వీడండి అంటూ టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సృజన మెడికల్ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని కె బోయనపల్లి, ఎంజీపురం పంచాయతీలలోని ప్రజలకు బుధవారం క్షయవ్యాధిపై టీబీ యూనిట్‌తో కలిసి డాక్టర్ సృజన అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో, వాటి ముఖ్య లక్షణాలను వివరించారు. క్షయపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. త్వరగా బరువు తగ్గినా, రెండువారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నా, తక్షణమే గల్ల పరీక్ష నిర్వహించుకోవాలన్నారు. రాజంపేట ఏరియా ఆసుపత్రిలో గల్ల పరీక్షలు ఉచితంగా చేసి ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాశ్, సీహెచ్‌ఓలు వెంకట నారాయణ, రాజమ్మ, సూపర్‌వైజర్లు రవీ, శివరాం, హెల్త్ అసిస్టెంటు మధు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మహాభారతం గొప్ప ఇతిహాసం



మహాభారతం ఆవశ్యకతను తెలియజేస్తున్న డాక్టర్ ఎల్‌ఎన్ చంద్రశేఖర్ రావు

పుల్లంపేట : మహాభారతం ఆవశ్యకత, గొప్పతనం గురించి తిరుమల, తిరుపతి దేవస్థానం, విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ఉపన్యాసకులు డాక్టర్ ఎల్‌ఎన్ చంద్రశేఖర్‌రావు పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధిని శాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో మహాభారతం గొప్పతనం గురించి వివరించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్‌ఎన్ చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ మహాభారతం ఎన్నో ధర్మ సూత్రాలు గల గొప్ప ఇతిహాసమని, అందులోని సందేశాలు, పాత్రలు ప్రజల హృదయాలలో చెరగనిముద్ర వేస్తాయన్నారు. మహాభారతం భారతదేశంలో జరిగిన సంఘటనలు, ధర్మం, నీతి, వేదాంతం, అలంకారం, వ్యాకరణ, రాజనీతి యుద్ధం తదితర అంశాలు గురించి తెలియజేస్తుందన్నారు. మహాభారతం వినడం, చదవడం ద్వారా ఎన్నో జన్మల పుణ్య ఫలమని వారు తెలియజేశారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయండి

పెనగలూరు : ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం చేయడంలో ప్రతి పంచాయతీల బీఎల్‌ఓలు వెనుకబడి ఉన్నారన్నారు. ఈనెల చివరిలోపు వందశాతం పూర్తి చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. బీఎల్‌ఓలు నేరుగా గ్రామాలలోకి వెళ్ళి ఓటర్లు ఇతర రాష్ట్రాలలో ఉంటే వారి బంధువులు ద్వారా ఫోన్ ద్వారా ఆధార్ నెంబరు సేకరించి వారి ఓటుకు అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు, సెక్రటరీలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్ రావు

వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా చూడండి

ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ప్రస్తుతం ఎండలు అధికమవుతున్నాయని రైతులకు, ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి విద్యుత్ అధికారులతో అన్నారు. బుధవారం ముక్కావారిపల్లె పంచాయతీ కొర్లకుంట అడ్డరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పక్కా రోడ్డు పనులను ఏడీఈ బాలజీతో కలిసి ఆయన ప్రారంభించారు. దాదాపు ఐదు లక్షల రూపాయలతో పక్కా రోడ్డు పనులుకు పూజలు నిర్వహించారు. సాయికిషోర్‌రెడ్డి విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ ఎస్టీ, ఎస్సీ గ్రామాలలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ శ్రీధర్ ఎంపీటీసీ అమృతాల విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు వడ్డి చెంగల్‌రెడ్డి, సుకుమార్, విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సాయికిషోర్‌రెడ్డి

రైతు సేవలో కళాశాల పునరంకితం

ఘనంగా వైఎస్సార్ ఉద్యాన కళాశాల వార్షికోత్సవం

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ రైతుల సేవకు పునరంకితమైందని అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ తెలిపారు. బుధవారం వైఎస్సార్ ఉద్యాన కళాశాల 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకిరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన వర్సిటీ ఏర్పాటు, ప్రాధాన్యత, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, రైతులకు చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యంగా తమ శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ద్వారా విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ రైతులకు సేవ చేస్తున్నామన్నారు. రైతు శ్రేయస్సే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. నూతన సాంకేతికత వారికి చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్సిటీ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చేస్తున్న కృషి ఫలితంగా భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ(ఐకార్) నుంచి ఏ– ఫస్ట్ ర్యాంకు పొందిందన్నారు. అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్యధన్ ఫైనాన్సియల్ సంస్థ ఎండీ డి.చట్టనాథన్, వర్సిటీ డీన్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, జోనల్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ వెంకటరమణ, తిరుపతి సీఆర్‌ఎస్ హెడ్ డాక్టర్ ఆర్.నాగరాజు, కళాశాల ఓఎస్‌ఏ డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాల్, డి.చట్టనాథన్

వడదెబ్బతో కాస్త జాగ్రత్త

- మార్చిలోనే మండుతున్న ఎండలు
- నీటిని ఎక్కువ మొత్తంలో సేవించాలంటున్న వైద్యులు
- మధ్యాహ్నం పూట బయటకు రాకపోవడమే మంచిదంటూ సూచన

సంబేపల్లె : వేసవిలో ఎండలు రోజురోజుకు మండిపోతున్నాయి. వాతావరణ మార్పులతో ఉక్కపోత మొదలైంది. ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు దాటుతున్నాయి. ఉదయం నుంచే వేడిగాలుల తాకిడి, భానుడి ప్రతాపం చూపుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోకుంటే వడదెబ్బకు గురై ప్రాణాలకే ముప్పువాటిల్లుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉంటాయని, ప్రజలు వడదెబ్బ బారినపడకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని సంబేపల్లె వైద్యుడు సూర్యనారాయణరెడ్డి సూచించారు.

వడదెబ్బ లక్షణాలు..

ఎండ తీవ్రత వల్ల మనిషి శరీరంలో నీటి శాతం తగ్గిపోయి ఎదురయ్యే సమస్య వడదెబ్బ. ఎండలో ఎక్కువ తిరగడం, పనిచేయడం, ప్రయాణం చేయడం కారణంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. వడదెబ్బ సోకిన వెంటనే నాలుక తడి ఆరిపోవడం, శరీర ఉష్ణోగ్రతల్లో తేడా కనిపించడం, తల నొప్పి, కండరాల నొప్పులు శ్వాసతీసుకోవడం కష్టంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



వైద్యుడు సూర్యనారాయణరెడ్డి, సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

చిన్నపాటి చికిత్సలతో ఉపశమనం

వడదెబ్బ సోకిన వ్యక్తిని వెంటనే చల్లటి ప్రదేశాల్లోకి తరలించి మంచినీటిని తాగించాలి. శరీరాన్ని తడి బట్టలతో తుడవాలి. ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగిస్తే చాలా వరకు ఉపశమనం కలుగుతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండలో సాధ్యమైనంతవరకు ప్రయాణాలు తగ్గించుకోవాలి. ఉపాధి కూలీలు, వ్యవసాయకూలీలు తమ పొట్టకూటి కోసం తప్పనిసరిగా పనులకు వెళ్లాల్సి ఉంటుంది, కాబట్టి ఉదయం పది గంటల లోపు పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలి. బయటకు వెళ్లడం తప్పనిసరి అయితే గొడుగు, టోపీ తీసుకెళ్లాలి. ఎండలో బయటకు వెళ్ళినప్పుడు తరచుగా మంచినీళ్లు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలి. కాటన్ దుస్తులను ధరించాలి. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటంతో రోజుకు ఆరు లీటర్ల మంచి నీటిని తాగాలి. వేసవికాలంలో మాంసాహారం, నూనె, మసాలాలతో చేసిన ఆహార పదార్థాలు తినకపోవడం ఆరోగ్యానికి చాలా మంచిది.